పెన్ పవర్
తెలంగాణ రౌండప్
బుధవారం 28 మే 2025 పేజీలు 8

# ట్రాఫిక్ రూల్స్ బ్రేక్..వారంలో 19వేల కేసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్ని చలాన్లు వేసినా మారడంలేదు..ఎన్ని అవగాహన కార్యక్రమాలు పెట్టినా ఫలితంలేదు..హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం పరిపాటి అయిపోయింది. ట్రాఫిక్ పోలీసులు ఫొటోకొట్టుకుంటారు..చలాన్లు పంపిస్తారు.డిస్కౌంట్లు ఇస్తుంటారు..వాళ్లపని వాళ్లు చేసుకుంటారు..మేం మాత్రం మారం అన్నట్లుంది సిటీలో వాహనదారుల తీరు. కేవలం హైదరాబాద్ నగరంలో ఒక్క వారంలో రికార్డు స్థాయిలో

-3 లో

- జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు..
- ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై జిల్లాల్లో ఇంచార్జి మంత్రుల పర్యటన..
- నకిలీ విత్తన విక్రేతలపై పీడీ యాక్ట్ నమోదుకు సీఎం ఆదేశం..
- కలెక్టర్ల ప్రో యాక్టివ్‌గా ఉంటూ వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలన్న సీఎం..
- తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వలి చిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.






# 90 శాతం ధాన్యం సేకరణ పూర్తి..!

- 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ..
- తెలంగాణ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ స్పష్టీకరణ..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 27:** ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని, కలెక్టర్‌లను, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో

-2లో




మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..

# జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

## గులాబీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



- జూన్ 2న తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహణ
- జాతీయ పతాకం, పార్టీ పతాకాలు ఎగురవేయాలని కేటీఆర్ పిలుపు
- అన్ని జిల్లా కార్యాలయాలు, నియోజకవర్గాల్లోనూ సంబరాలు

-3 లో


# అందాల పోటీల ఫైనల్‌కి కౌంట్‌డౌన్

- టాప్ 40లో ఇప్పటికే 12 బెర్తులు ఖరారు
- మిగిలిన వారిని ఎంపిక చేయనున్న న్యాయనిర్ణేతలు
- 31న జరిగే కార్యక్రమానికి హైటెక్స్‌లో ఏర్పాట్లు



-3 లో

# 90 శాతం ధాన్యం సేకరణ పూర్తి..!







## 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ..

రుతుపవనాలు ముందస్తుగా రావడంతో, మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారిందని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ.12184 కోట్లు చెల్లించామని, గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయని, కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయని వీడియో కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నారు..

## తప్పుడు ప్రచారాలకు తక్షణమే వివరణ ఇవ్వండి..

అనారోగ్యంతో రైతు మృతిచెందినా..! ధాన్యం కొనుగోలు జాప్యం వల్లనే అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలని, కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా ఉంటూ వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలని సూచించారు.. తప్పుడు ప్రచారం చేస్తే వెంటనే వివరణ ఇవ్వలని, చిన్న చిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.. ఒక్క నిముషం వృధా చేయకూడదు, అదే సమయంలో నిర్లక్ష్యం వహించొద్దని, అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయమని అన్నారు.. అదేవిధంగా మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు.




## జూన్ 3 నుంచి మూడోదశ రెవెన్యూ సదస్సులు..

భూభారతి పేద రైతులకు చుట్టం అనే విషయం ప్రజలలోకి వెళ్లాలని.. అందుకు అవగాహన సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు.. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని, ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకంగా పేర్కొన్నారు.. క్షేత్రస్థాయిలో విజయవంతం కావాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలి, మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి, ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి, ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు అందించండి, క్షేత్ర స్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించు కోవాలని, 29, 30 తేదీల్లో జిల్లాల ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలని సిఎం సూచించారు.. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక అందించాలని తెలిపారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతమ్, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉందని, సీజన్ ముందుగానే రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి, నకిలీ విత్తనాల విక్రేతలపై తనిఖీలు చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.. జిల్లాల వారిగా పర్యవేక్షించే ప్రత్యేక అధికారిని నియమించు కోవాలని సూచించారు..

- **మొదటి పేజి తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమ టిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు అంశాలపై చర్చించారు.. వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిం దన్నారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను సీఎం అభినందించారు..

# వైష్ణవ సేవాసమితి ఆధ్వర్యంలో.. ఉచిత వివాహ పరిచయ వేదిక..

## ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల భగవద్ బంధువులు హాజరు..

**హైదరాబాద్, పెన్ పవర్, మే 27:** శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు హాజరయ్యారు.. చెన్నై, కేరళ, కర్నాటక, కర్నూల్, వైజాగ్, అనంతపూర్, తిరుపతి శ్రీకాళహస్తి నుండి హాజరయ్యారని నిర్వాహకులు పేర్కొన్నారు.. దూర ప్రాంతాల నుండి సుమారు 800 వందల మంది తమ తమ అవివాహిత యువతీ యువకులతో హాజరు కావడంపై శ్రీ వేంకటేశ్వర చాత్తాద శ్రీ వైష్ణవ సేవాసమితి సేవలకు స్వచ్ఛతకు సేవా తత్పరతకు నిలువెత్తు నిదర్శనం.. అవివాహిత యువకులు సుమారు 160 మంది, యువతులు సుమారు 60 వారి వారి కుటుంబ పెద్దలతో శ్రేయోభిలాషులతో వ్యక్తిగతంగా పాల్గొని వారి స్వీయ పరిచయం, అభీష్టాలను సభాముఖంగా ఉచిత వివాహ పరిచయ వేదికపై సందడి చేయడం అభినందనీయం..

**అనూహ్యమైన స్పందన..**



ఇంతింతై వటుడింతై అన్న నానుడికి ప్రతీకగా ఒక్కో విడతకు తాము ఊహించని రీతిలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు హాజరయ్యారు.. అనూహ్యమైన స్పందనలతో మా సేవలను అభినందించిన తీరు అనిర్వచనీయం.. ఇక కొందరు మహానుభావులు గొప్ప ఔదార్యంతో అధిక వ్యయంతో కూడిన కార్యక్రమం అని గ్రహించి వారి దాతృత్వపు విరాళాన్ని అందించారని అన్నారు.. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మధ్యాహ్నం భోజన వసతి సౌకర్యాలు, సాయంత్రం మజ్జిగను అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.. కమ్యూనిటీ పెద్దలు వివాహ బంధ విశిష్టతను, ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వాహణ ప్రాశస్త్యాన్ని వివరించి నిర్వాహకులను అభినందించిన వారిలో..! మాజీ రాష్ట్ర చాత్తాద శ్రీ వైష్ణవ

సంఘం అధ్యక్షుడు కర్పూరం, గోపీధర్, ఆల్ ఇండియా మాజీ కార్యదర్శి కర్పూరం రాజేందర్, రాష్ట్ర సంఘం మాజీ బాధ్యులు బొట్టు రాజేష్, ధార్మిక సంస్థ ఉపాధ్యక్షుడు శ్రీ కేశవ్, సైంటిస్టు టి. వరప్రసాద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పెద్దలు ప్రసంగించారు.. సేవాసమితి బాధ్యులు పరాంకుశం, లక్ష్మణ స్వామి, బోధనం పరాంకుశం, రామానుజం గిరిధర్, తిరునగరి నరసింహం, పట్లూరి వెంకటేశ్వర్లు, దాశరథి వెంకట రమణ, రేబల్లి శ్రీకాంత్, రామానుజం యాదగిరి, శ్రీరంగం పాండురంగం, శ్రీమతి అనురాధ, శ్రీమతి లక్ష్మి ప్రసన్న మరియు బోధనం రమాదేవి మున్నగు వారు బాధ్యతతో కార్యక్రమం విజయవంతం చేశారు..

## జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాలతో పాటు, నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగురవేసి, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ భవన్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పాల్గొని జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని వెల్లడించారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అదేవిధంగా, రాష్ట్రం లోని అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాలను ఎగురవేసి సంబరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కేంద్రాలతో పాటు అన్ని నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లోనూ జాతీయ పతాకాన్ని, గులాబీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ అవతరణ సంబరాలను ప్రజలతో కలిసి జరుపుకోవాలని కేటీఆర్ అన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "14 ఏళ్ల అలుపెరగని పోరాటం, ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి" అని తెలిపారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారమైందని ఆయన గుర్తు చేశారు. "కొట్లాడి సాధించుకున్న తెలంగాణ

తొలి పదేళ్ల ప్రస్థానం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా దిక్సూచిగా నిలిచింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే దారిచూపే దీపస్తంభాల్లా నిలవడం ప్రతి తెలంగాణ బిడ్డకూ గర్వకారణమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులంతా ఈ వేడుకల్లో పాల్గొని, ప్రజలతో కలిసి అవతరణ వేడుకలను విజయవంతం చేయాలని కేటీఆర్ కోరారు.

## ట్రాఫిక్ రూల్స్ బ్రేక్..వారంలో 19వేల కేసులు

- మొదటి పేజి తరువాయి

ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ సిటీ వ్యాప్తంగా ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో రికార్డు స్థాయిలో ట్రాఫిక్ రూల్స్ అతిక్రమణ కేసులు నమోదు అయ్యాయి. మే 20 నుంచి మే 26 వరకు వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 18,798 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు చేశారు. మే 27, మంగళవారం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం..రాంగ్ రూట్ లో వాహనం నడిపినందుకు వాహనదారులపై దాదాపు 14,917 కేసులు చేశారు. ఈ ప్రమాదకరమైన పద్ధతి ప్రజా భద్రతకు తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తోందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

ఇక నంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఈ విషయంలో మొత్తం 3,881 కేసులు నమోదు చేశారు. ఇది వాహన గుర్తింపు నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.

రోడ్డు నియమాలను పాటించి, సురక్షితమైన హైదరాబాద్‌కు దోహదపడాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు తమ పిలుపునిచ్చారు. "ట్రాఫిక్ నియమాలను పాటించండి. హైదరాబాద్‌ను సురక్షితంగా ఉంచుకుందాం" అని ఆ విభాగం తన సందేశంలో #FollowTrafficRules అనే హ్యాష్‌ట్యాగ్‌ని ఉపయోగించి అవగాహన కల్పిస్తున్నారు.

## అందాల పోటీల ఫైనల్‌కి కౌంట్‌డౌన్

**హైదరాబాద్ పెన్ పవర్:** మిస్ వరల్డ్ 2025 ఫైనల్ పోటీలకు కౌంట్‌డౌన్ మొదలైంది. క్వార్టర్ ఫైనల్‌కు చేరిన 40 మంది అందాలభామలు ఫైనల్‌లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడతారు. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఒకరు, టాలెంట్ ఛాలెంజ్‌లో ఒకరు, హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో నలుగురు, టాప్ మోడల్ పోటీల్లో నలుగురు, బ్యూటీ విత్ ఏ పర్పస్ విభాగం నుంచి నలుగురు.. మొత్తం 14 మంది విజేతలై ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో క్వార్టర్స్‌కు చేరారు. మిగతా 26 మందిని అమెరికా–కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా–ఓషియానా ఖండాల వారీగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండోనేసియా, వేల్స్ భామలు రెండు పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ ప్రకారం టాప్–40లో ఇప్పటివరకు 12 బెర్తులు మాత్రమే ఖరారయ్యాయి. అంటే ఇంకా 28 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. టాప్ 40లో కూడా ఒక్కో ఖండం నుంచి పది మంది ఉండేలా ఎంపిక చేస్తారు. ఆ తర్వాతి రౌండ్‌లో వీరిలోంచి టాప్ 20ని తీసుకుంటారు. ఒక్కొక్క ఖండం నుంచి ఐదుగురు ఉంటారు. ఇక అంతిమ ఘట్టానికి ముందు టాప్ 8 అంటే ఒక్కో ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరే అంటే నలుగురు అంతిమంగా కిరీటం కోసం మిగులుతారు. వీరిలో ఒకరు విజేతగా, మిగిలిన ముగ్గురు ఒకటి, రెండు, మూడో రన్నరప్‌గా నిలుస్తారు.

**3,500 మంది అతిథులు వస్తారని అంచనా..**

హైదరాబాద్ హైటెక్స్‌లో కొత్తగా నిర్మించిన నాలుగో హాల్‌లో 31న జరిగే ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, పర్యాటక శాఖ, నిర్వాహకులు ఈ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హాల్ సామర్థ్యం 3,500 మంది కావడంతో అంతమంది అతిథులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫైనల్ వేడుకలు సాయంత్రం నుంచే మొదలవుతాయి. తుది పోటీలు రాత్రి 10 నుంచి అర్ధరాత్రి వరకు జరగనున్నాయి.

# కేరళలో కుంభవృష్టి.. 6 వందల ఇండ్లు నేలమట్టం.. బతుకు జీవుడా అంటూ పడవల్లో వెళ్లిపోయిన ప్రజలు

**హైదరాబాద్ పెన్ పవర్:**కేరళలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. పక్షులు, జంతువులు ఆహారం లేక అల్లాడుతున్నాయి. బలమైన ఈదురు గాలులకు చెట్లు విరిగి పడుతుండటంతో.. పక్షులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు విడుస్తున్నాయి. మంగళవారం (మే 27) ఆకాశానికి చిల్లు పడినట్లుగా గ్యాప్ లేకుండా కురుస్తున్న కుంభవృష్టితో కేరళలో కొన్ని ప్రాంతాలు అల్లకల్లోలం అయ్యాయి. భారీ వర్షాలకు రైళ్ల రాకపోకలు ఆగిపోయాయి. కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. చెట్లు కూలి ట్రాక్ లపై పడుతుండటంతో రైళ్లు నడపడం కష్టంగా మారింది. కోజికొడ్–అరీకొడ్ మార్గంలో భారీ వృక్షం విరిగి పడటంతో రైల్వే కరెంటు లైన్ తీగలు ట్రాక్ పై పడిపోయినట్లు అధికారులు ప్రకటించారు. రూట్లను క్లియర్ చేసి రైళ్లను నడపాలనుకున్న కొద్ది గంటల్లోనే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. తిరువనంతపురం వందే భారత్, పరశురాం ఎక్స్ ప్రెస్ మొదలైన రైళ్లు ఆలస్యంగా నడుస్తాయని ప్రకటించారు.

భారీ వర్షాలకు నదులలో నీటిమట్టం అంతకంతకూ పెరిగిపోయి లోతట్టు ప్రాంతాలకు ప్రవహిస్తున్నాయి.




ఉత్తర వయనాడ్ జిల్లాలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం (మే 27) ఇండ్లు కొట్టుకుపోయాయి. దాదాపు 600 ఇండ్లు కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రజలు ఫైబర్ బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నట్లు తెలిపారు. వందల మంది ట్రైబల్స్ ను రిలీఫ్ క్యాంపులకు చేర్చారు అధికారులు. భారీ వర్షాలకు ఎర్నాకులం జిల్లాలో ఇండ్లతో పాటు పంటలన్నీ నేలమట్టమయ్యాయని, భారీగా ఆస్తి నష్టం అయ్యిందని తెలిపారు అధికారులు. ముఖ్యంతా కొత్తమంగళం ఏరియా పూర్తిగా డ్యామేజ్ అయినట్లు తెలిపారు. ఇక నగరాలు, పట్టణాల లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వడంతో ట్రాఫిక్ లో చిక్కుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిరువనంతపురం లోని కల్లార్ లో భారీ బిల్డింగ్ లు కూలిపోయి ట్రాఫిక్ స్థంభించిపోయింది. కేరళలో సంభవించిన జల విలయంపై రెవెన్యూ మంత్రి కే రాజన్ మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 607 ఇండ్లు కూలిపోయాయని.. అందులో 21 ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. వర్షాల కారణంగా కరెంటు సప్లై నిలిచిపోయి ప్రజలు ఆందోళన చెందుతున్నారని, త్వరలోనే పునరుద్ధరిస్తామని చెప్పారు. మంగళవారం వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ విడుదల చేసింది. తిరువనంతపురం, కొల్లాం, అలపూజ, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకులం, మలప్పురం, కోజికొడ్, కన్నూర్, కాజర్ ఘడ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. 11 నుంచి 20 సెంటీమీటర్ల భారీ వర్షాలు కురిస్తేనే ఆరెంజ్ అలర్ట్ ప్రకటిస్తారు. అంటే కేరళలో వర్షాలు ఎంతగా కురుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళలోకి ప్రవేశించడం.. రోహిణి కార్తె పూర్తి కాకముందే వర్షాలు కురవడంతో.. కేరళ అతలాకుతలం అయ్యింది. మరో రెండు రోజులు ఇలాగే కురిస్తే ఏర్పడే నష్టాన్ని అంచనా వేయలేమని రెవెన్యూ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

# మెయిన్‌బోర్డ్ ఐపీవో కోసం ఎగబడుతున్న ఇన్వెస్టర్లు.. గ్రేమార్కెట్లో దూకుడు..




**హైదరాబాద్ పెన్ పవర్:**సుదీర్ఘకాలం బ్రేక్ తీసుకున్న తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లలో మళ్లీ ఐపీవోల కోలాహలం కొనసాగుతోంది. గడచిన కొన్ని రోజులుగా ఐపీవోల లిస్టింగ్స్ జరుగుతుండగా.. మార్కెట్ల ప్రతికూలతల్లో కూడా ఇన్వెస్టర్లకు ఇవి కాసుల పంట కురిపిస్తున్నాయి. దీంతో మళ్లీ 2024 నాటి జోరు మొదలవుతుందేమో అనిపిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది ప్రోస్టెమ్ ఇన్ఫో సిస్టమ్స్ కంపెనీ ఐపీవో గురించి. మెయిన్ బోర్డ్ కేటగిరీ కింద వస్తున్న ఐపీవో ఏకకాలంలో ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో లిస్టింగ్ కానుంది. నేడు కంపెనీ ఐపీవో సబ్ స్క్రిప్షన్ కోసం స్టార్ట్ అవ్వగా ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఐపీవోలో పెట్టుబడి కోసం రిటైల్ ఇన్వెస్టర్లు, ఎన్ఐఐలు ఎక్కువ ఆసక్తిని కనసబరుస్తున్నారని తేలింది.

వాస్తవానికి కంపెనీ తాజా ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.168 కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం కోటి 60 లక్షల తాజా ఈక్విటీ షేర్లను సైతం కంపెనీ ఆఫర్ చేస్తోంది. ఈ క్రమంలో కంపెనీ తన ఐపీవో ప్రైస్ బ్యాండ్ ధరను షేరుకు రూ.95 నుంచి రూ.105గా ప్రకటించింది. అలాగే లాట్ పరిమాణాన్ని 142 షేర్లుగా నిర్ణయించటంతో ఎవరైనా ఇన్వెస్టర్ ఐపీవోలో పాల్గొనటానికి కనీసం రూ.13వేల 490 పెట్టుబడిగా పెట్టాల్సి ఉందని తేలింది.

ప్రస్తుతం కంపెనీ షేర్ల కోసం ఇన్వెస్టర్ల నుంచి మంచి డిమాండ్ కనిపించటంతో షేర్లకు గ్రేమార్కెట్లో గిరాకీ పెరుగుతోంది. ప్రస్తుతం ఒక్కో షేరుపై గ్రేమార్కెట్ ప్రీమియం రూ.25గా కొనసాగుతోంది. లిస్టింగ్ రోజు వరకు ఇదే కొనసాగితే స్టాక్ ధర ఒక్కోటి రూ.130 చొప్పున జాబితా అయ్యే అవకాశం ఉంది.

**కంపెనీ వ్యాపారం..**

ముంబై కేంద్రంగా పనిచేస్తున్నఈ కంపెనీ పవర్ సొల్యూషన్స్ ఉత్పత్తులను డిజైన్, తయారీ వ్యాపారంలో ఉంది. కంపెనీ యూపీఎస్ సిస్టమ్స్, ఇన్వర్టర్ సిస్టమ్స్, సోలార్ హైబ్రిడ్ ఇన్వర్టర్ సిస్టమ్స్, లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్స్, వోల్టేజ్ స్టెబిలైజర్లు వంటి ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది.

# పన్ను చెల్లింపుదారులకు ఊరట.. ఐటీఆర్ గడువు సెప్టెంబర్ 15కి పెంపు..




**హైదరాబాద్ పెన్ పవర్:** వాస్తవానికి ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు తమ ఐటీఆర్ ఫైల్ చేసేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ జూలై 31 చివరి గడువుగా ప్రకటిస్తుంటుంది. అలాగే ఇందులో ఏదైనా కారణాల వల్ల మార్పులు జరిగితే దానిపై ప్రకటన చేస్తుంటుంది. వాస్తవానికి ఈ సంవత్సరం కూడా టాక్స్ రిటర్న్లు ఫైల్ చేసేవారు జూలై 31, 2025 నాటికి వాటిని పూర్తి చేయాల్సి ఉంది.

అయితే తాజాగా జూలైగా ఉన్న పన్ను రిటర్న్ ఫైలింగ్ చివరి గడువును సెప్టెంబర్ 15, 2025 వరకు పొడిగిస్తున్నట్లు పన్ను శాఖ ప్రకటించింది. దీనిపై తాజాగా సర్క్యులర్ కూడా విడుదల చేసింది. వాస్తవానికి కొత్త ఐటీఆర్ ఫారంల విడుదలలో జరిగిన జాప్యం, ఫైలింగ్ కోసం అవసరమైన టూల్స్ లేటు కారణంగా గడుపు పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే ఫారంలు ఈ ఏడాదిలో అనేక మార్పులకు లోనయ్యాయి. అందువల్ల టాక్స్ డిపార్ట్మెంట్ వీటిని ప్రజలు తమ రిటర్న్లు ఫైల్ చేసుకునేందుకు వాడుకునేందుకు అందుబాటులోకి తీసుకురావటానికి మరింత సమయం పడుతోందని వెల్లడించింది. వాస్తవానికి టాక్స్ డిపార్ట్మెంట్ ఫైనల్ ఐటీఆర్ ఫారంలు, వాటిని ఫిల్ చేసేందుకు ఆన్ లైన్ యుటిలిటీస్ సిద్ధం చేయకపోతే ప్రజలు తమ ఆదాయపు పన్ను రిటర్న్లు దాఖలు కుదరదు. ప్రస్తుతం వీటి ప్రక్రియలో ఆలస్యం వల్ల గడువు పొడిగించాల్సిన అవసరం వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఫారంలు అందుబాటులోకి రాగానే దీనిపై ప్రకటన చేస్తామని, అప్పటి నుంచి ప్రజలు తమ ఫైలింగ్ ప్రక్రియను ప్రారంభించవచ్చని ట్విట్టర్ ఖాతా పోస్టులో స్పష్టం చేసింది.

## ఇటిక్యాల గ్రామంలో ఉద్రిక్తత

**నిర్మల్: పెన్ పవర్:** పెంబి మండలం ఇటిక్యాల గ్రామం లో పోడు భూముల్లో సాగు చేస్తున్న వారిని ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. 1985 సంవత్సరం లో ఎన్టీఆర్ ఇచ్చిన పొడు భూములను రైతులు సాగు చేస్తున్నారు. సుమారు 80 ఎకరాలు 45 కుటుంబాలకు ఇవ్వడంతో అప్పటి నుండి సాగు చేస్తున్నామని స్థానికులు అంటున్నారు. పెంబి ఫారెస్ట్ అధికారులు అభూమిలో మొక్కలు పెట్టడానికి గుంతలు తవ్వడంతో గుంతలను తవ్వకుండా మహిళ రైతు అడ్డు పడుకుంది. దాంతో ఫారెస్టు అధికారులకు, రైతులకు తీవ్ర వాగ్వాదం నెలకొంది.

## కవిత వ్యవహారం ఒక ఫ్యామిలీ డ్రామా ఎంపి రఘునందన్ రావు

**మెదక్: పెన్ పవర్:** మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేసారు. కవిత ఎపిసోడ్ ని ఫ్యామిలీ డ్రామాతో పోల్చారాయన.

ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తెలంగాణలో దేవుళ్ళు ఉన్నారా దెయ్యాలు ఉన్నాయా అన్న విషయంపై చర్చ జరుగుతుంది. దేవుడి పక్కన దెయ్యం ఉంటే 12 ఏళ్లుగా ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని వాళ్లే నాటకం ఆడుతున్నారు. ఒకరితో గొడవ పడితే మరొకరి దగ్గరికి పోయేలా గ్రూపులు క్రియేట్ చేస్తున్నారు. మాట్లాడుకోవా లంటే తండ్రి,కూతురి మధ్య మధ్యవర్తి ఎందుకు వస్తారు . నా రాజకీయ పరిజ్ఞానం ప్రకారం కవిత సొంత పార్టీ పెట్టాలని ఫిక్స్ అయ్యింది. జూన్ 2న కవిత కొత్త పార్టీ పెట్టవచ్చు..తర్వాత పాదయాత్ర చేయోచ్చని అన్నారు.

# రూ.20 కోట్ల అప్పు..ఆ ఏడుగురి ప్రాణాలు తీసింది:డబ్బుల కోసం చంపేస్తామని బెదిరింపులు




**హైదరాబాద్ పెన్ పవర్:**బిజినెస్?లో లాస్ రావడంతో ఓ కుటుంబం వీధిన పడింది. దీనికితోడు అప్పుల బాధ..ఊరు వదిలి కొన్నేళ్లు వేరే ప్రాంతానికి వెళ్లి బతకాలనుకున్నారు..అయినా ఆ కుటుంబాన్ని అప్పులిచ్చిన బ్యాంకులు, మనీ లెండర్లు వదల్లేదు..చేసేదేమీ లేక చివరికి ఆ కుటుంబం మొత్తం ఊకుమ్మడిగా ప్రాణాలు తీసుకుంది. హర్యానాలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇటీవల బయటికి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం (మే25) హర్యానాలోని పంచకులలో ఓ కుటుంబానికి చెందిన ఏడుగురు ఇంటిబయట నిలిపి ఉంచిన కారులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ కుటుంబ హిసార్ బార్వాలాకు చెందిన ప్రవీణ్ కుటుంబంగా పోలీసులు, బంధువులు గుర్తించారు. హిస్సార్ లోని బాల్వారాకు చెందిన ప్రవీణ్ తన కుటుంబం కలిసి పన్నెండేళ్లక్రితం పంచకులకు బతుకుదెరువు కోసం వచ్చారు.

ప్రవీణ్..హిమాచల్ ప్రదేశ్ లో ఓ స్క్రాప్ ఫ్యాక్టరీ ని నడుపుతున్నాడు. ఫ్యాక్టరీ నష్టాల్లో నడవడంతో దాదాపు రూ. 20కోట్లకు పైగా బ్యాంకు, ఇతర మనీలెండర్లనుంచి అప్పులు చేశాడు. అప్పులు కట్టలేని పరిస్థితిలో ప్రవీణ్ వారి కంటపడకుండా తిరుగుతున్నాడు. ఈక్రమంలో వారిని చంపుతామని బెదిరింపులు రావడం ప్రవీణ్ కుటుంబాన్ని ఆందోళనకు గురిచేసింది.

అప్పులు చెల్లించకపోవడంతో ఫ్యాక్టరీతోపాటు , తన రెండు ప్లాట్లు, ఇతర ఆస్తులు బ్యాంకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెరుగుతున్న అప్పుల కారణంగా ప్రవీణ్ హిసార్ వదిలి డెహ్రాడూన్ కు ఫ్యామిలీ షిఫ్ట్ చేశాడు. పంచుకులలోని సాకేత్రి గ్రామంలో నివాసం ఉంటూ ప్రవీణ్ ట్యాక్సీ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే పెరుగుతున్న అప్పుల కారణంగా వేధింపులు తాళలేక పంచకులలోని ప్రవీణ్ ఇంటి బయట నిలిపి ఉంచిన కారులోనే కుటుంబంలోని ఏడుగురు సభ్యులు విషం తీసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన స్థానికులు బయటికి తీయగా ఆరుగురు స్పాట్ లోనే చనిపోయాడు.. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు.

ఆదివారం పంచకులలో ప్రవీణ్ కుటుంబానికి చెందిన ఏడుగురు ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. అప్పుల బాధ తాళలేకనే ప్రవీణ్ కుటుంబం ఊకుమ్మడి ఆత్మహత్య కు పాల్పడిందని, తమకు అంత్యక్రియలు జరపాల్సిందిగా సూసైడ్ నోట్ లో కోరారని ప్రవీణ్ బంధువు ఒకరు మీడియాకు తెలిపారు.

# భవిష్యత్ తరాల వనరులు : నేషనల్ మిషన్ ఫర్ గ్రీన్ ఇండియా



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుత ప్రజల కనీస అవసరాలను తీరుస్తూ భవిష్యత్ తరాల వారికి వనరులను మిగిల్చేలా వాటిని వివేకవంతంగా వినియోగించుకోవడం ద్వారా సాధించే అభివృద్ధిని సుస్థిరాభివృద్ధి అని పిలుస్తారు. భావితరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ఉండాలని సుస్థిరాభివృద్ధి సూచిస్తుంది. మానవ సంక్షేమాన్ని పెంపొందించుకోవడానికి ఆర్థికవృద్ధి ఒక్కటే సరిపోదు, వనరుల వినియోగం, పునర్? కల్పనల మధ్య సమతుల్యతలను ఏర్పరిచి అభివృద్ధి ప్రక్రియను కొనసాగిస్తే సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుంది. కాబట్టి ప్రస్తుత కాలంలో అభివృద్ధి వ్యూహాలు, సమాజం, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం సామూహిక అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తున్నాయి. మానవ జనాభా పెరిగే కొద్దీ అవసరాల కోసం అభివృద్ధి పేరుతో సహజ వనరులను పరిమితికి మించి వినియోగించడం వల్ల భూ, జల వనరులు, వాతావరణం కలుషితమై అనేక పర్యావరణ సమస్యలకు దారితీస్తుంది. పేదరికం, తాగునీటి సమస్య, అంటువ్యాధులు ప్రబలి సామాజిక సమస్యలకు దారి తీయడమే కాకుండా వనరుల కొరత తీవ్రమై భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది.

### నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమట్ ఛేంజ్ ప్లాన్

ఇది శీతోష్ణస్థితి మార్పులపై భారత్ మొదటి కార్యాచరణ ప్రణాళిక. దీనిని 2008, జూన్ 30న మన్మోహన్?సింగ్ విడుదల చేశారు. దీని ముఖ్యోద్దేశం శీతోష్ణస్థితిలో మార్పులకు కారణమైన గ్రీన్?హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం, కాలపరిమితితో కూడిన కాలుష్యరహిత అభివృద్ధి పథకాల ద్వారా పర్యావరణ పరిరక్షణ చేపట్టడం. ఇందులో భాగంగా భారతదేశం వివిధ రంగాలకు చెందిన ఎనిమిది రకాల మిషన్స్ చేపట్టి ఉద్గారాలను తగ్గించి సుస్థిరాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఎనిమిది రకాల మిషన్స్ ఈ విధంగా ఉన్నాయి.

### జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ సోలార్ సిస్టమ్

సౌర విద్యుత్తును ప్రోత్సహించడం, అభివృద్ధి పరచడం పట్టణాలు, పరిశ్రమలు, ఇతర వాణిజ్య సంబంధ నిర్మాణాల వద్ద సోలార్ ఎలక్ట్రిసిటీ వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టడం.

ప్రతి సంవత్సరం సోలార్ విద్యుత్ సామర్థ్యం పెరిగేలా సౌర విద్యుత్తు ఉత్పత్తి.

### నేషనల్ మిషన్ ఫర్ ఎన్హన్స్డ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ

దీని ప్రధాన లక్ష్యం విద్యుత్తును ఆదా చేయడం, దీనికి విద్యుత్ వినియోగ పరికరాలకు రేటింగ్ ఇవ్వడం, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో పీపీపీ విధానాన్ని ప్రోత్సహించడం.

### నేషనల్ మిషన్ ఫర్ సస్టయినబుల్ హాబిటెట్

విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టడం, హరిత ప్రజా రవాణాను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆవాసాలను అభివృద్ధి పరుచుకోవడం దీని ముఖ్యోద్దేశం.

### నేషనల్ వాటర్ మిషన్

సమీకృత నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వృథాను అరికట్టడం, అభిలషణీయమైన రీతిలో నీటి వినియోగానికి సంబంధించి అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని 20 శాతానికి పెంచడం.

నేషనల్ మిషన్ ఫర్ సస్టైయినింగ్ ది హిమాలయన్ ఎకో సిస్టమ్

దీని ప్రధాన ఉద్దేశం సుస్థిరాభివృద్ధి పథకాల ద్వారా హిమాలయ ప్రాంతాల్లో జీవవైవిధ్య సంరక్షణ, అటవీ సంరక్షణ, హిమానీనదాల పరిరక్షణను చేపట్టడం.

### నేషనల్ మిషన్ ఫర్ గ్రీన్ ఇండియా

ప్రస్తుతం ఉన్న 23 శాతం అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచడం, నాశనమైన అటవీ భూమిలో 10 మిలియన్ హెక్టార్లలో మొక్కలను పెంచే కార్యక్రమం చేపట్టడం. 2020 నాటికి కార్బన్ శోషక వనరుల సామర్థ్యాన్ని 50 నుంచి 60 మిలియన్ టన్నులకు పెంచడానికి తగిన చర్యలు తీసుకోవడం.

### నేషనల్ మిషన్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్

వ్యవసాయ శీతోష్ణస్థితి ప్రాంతాల్లో వ్యూహాత్మక ప్రణాళికల ద్వారా పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల పెంపొందించడం, సాంకేతికపరమైన మౌలిక వస్తువుల సామర్థ్యాన్ని పెంపొందిస్తూ తగిన వ్యవసాయ మౌలిక వస్తువులను అభివృద్ధి చేసుకోవడం. ఇందులో ముఖ్యమైన అంశాలు.. ఎ. శీతోష్ణస్థితికి అనుకూలమైన పంటల ఎంపిక. బి. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను మళ్లించడం.

### నేషనల్ మిషన్ ఆన్ స్ట్రాటజిక్ నాలెడ్జ్ ఫర్ క్లైమెట్ ఛేంజ్

శీతోష్ణస్థితి శాస్త్రం ప్రకారం సవాళ్లు తదితర అంశాలపై అధ్యయనం, తదనుగుణంగా చేపట్టే చర్యలకు రూపకల్పన చేయడం.

### బచావత్ ల్యాంప్ యోజన

సుస్థిరాభివృద్ధిలో భాగంగా ఇంధన పొదుపు కోసం చేపట్టిన కార్యక్రమం. 2009లో ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రారంభించారు. ముఖ్యోద్దేశం సంప్రదాయ బల్బుల స్థానంలో అదే ధరకు కాంపాక్ట్ ఫ్లోరోసెంట్ ల్యాంప్ (సీఎఫ్ఎల్) బల్బులను అందించడం, దీన్ని క్యోటో ప్రొటోకాల్లోని క్లీన్ డెవలప్మెంట్ మెకానిజాన్ని (సీడీఎం) ఉద్దేశించి అమలు చేస్తున్నారు. వీటి వల్ల కాలుష్యం తగ్గుతుంది.

# అల్పపీడనం ఎఫెక్ట్.. ఒడిశాకు భారీ వర్షాలు..ఐఎండీ హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** నైరుతి రుతుపవనాలతో ఇప్పటికే దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వర్షాలు దొంచికొడుతున్నాయి. బంగాళాఖాతంలో ఒడిశా తీరంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి, అస్సాం,మేఘాలయ, ఛత్తీస్ ఘడ్, వెస్ట్ బెంగాల్, గుజరాత్ నాగాలాండ్ మణిపూర్,మిజోరాం, త్రిపురలో భారీ వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఒడిశాలోని పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు,భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నబరంగాపూర్, కలహండి, కంధమల్, రాయగడ, గజపతి సహా ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. రాబోయే మూడు గంటల్లో గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులతో కూడిన మోస్తరు ఉరుములు, మెరుపులు, తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మయూర్‌భంజ్, బాలసోర్, కియోంఝర్, భద్రక్, జాజ్‌పూర్, అంగుల్, దెంకనల్, కటక్ (కటక్ నగరంతో సహా), ఖోర్ధా (భువనేశ్వర్ నగరంతో సహా), పూరి, గంజాం , బౌధ్ సహా అనేక ఇతర జిల్లాలకు IMD ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాలలో 30-40 కి.మీ వేగంతో గాలి వానలు, మెరుపులు మరియు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.భారీ వర్ష ప్రభావిత జిల్లాల్లోని నివాసితులు అలర్ట్ గా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని సూచించింది ఐఎండీ.



మరో వైపు నైరుతి రుతుపవనాలు రాకతో కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో కేరళలో రాబోయే 5 రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్,ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. మంగళవారం (మే 27) మూడు జిల్లాల్లో భారీ వర్షాలున్నాయని రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కోజికోడ్, వయనాడ్, కన్నూర్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. అల్పపీడనం, నైరుతి రుతుపవనాల రాకతో భారీవర్షాలు కురుస్తున్నందున మంగళవారం కేరళ రాష్ట్రంలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది ఐఎండీ. కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిసూర్, పాలక్కాడ్, మలప్పురం, కాసరగోడ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

నైరుతి రుతుపవనాల రాకతో ఈ రోజు తెలంగాణలోని కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తెలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ కేంద్రం ప్రకటించింది. మరో మూడు రోజులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అకవాశం ఉందని ప్రకటిచంచారు. గాలి గంటకు 40-50 కి. మీ వేగంతో దాదాపు అన్ని జిల్లాలలో అక్కడక్కడ వీచే అవకాశం ఉందని తెలిపింది.

# కుండపోత వర్షాలతో రెడ్ అలర్ట్ ఇచ్చిన కేరళ

**హైదరాబాద్ పెన్ పవర్:**తిరువనంతపురం: నైరుతి రుతుపవనాలు రాకతో కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో కేరళలో రాబోయే 5 రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్,ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. మంగళవారం (మే 27) మూడు జిల్లాల్లో భారీ వర్షాలున్నాయని రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కోజికోడ్, వయనాడ్, కన్నూర్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. అల్పపీడనం, నైరుతి రుతుపవనాల రాకతో భారీవర్షాలు కురుస్తున్నందున మంగళవారం కేరళ రాష్ట్రంలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది ఐఎండీ. కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిసూర్, పాలక్కాడ్, మలప్పురం, కాసరగోడ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

మరోవైపు కేరళ మీదుగా పశ్చిమ గాలులు బలంగా వీస్తాయిని వాతావరణ శాఖ అలెర్ట్ చేసింది. తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ జిల్లాల్లో మంగళవారం మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఒడిశా తీరానికి సమీపంలో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. రాబోయే 5 రోజులు కేరళలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. మే 27నుంచి -30 వరకు అతి భారీ వర్షాలు, 27నుంచి -31 వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది.



సముద్రంలో మునిగిపోయిన ఓడ.. ఒడ్డుకు కొట్టుకొచ్చిన కంటైనర్లు

సోమవారం కేరళ తీరంలో సముద్రంలో లైబీరియా కార్గోషిఫ్ MSC ELSA3 మునిగిపోయిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కంటైనర్లు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. మంగళవారం ఉదయం తిరువనంతపురం జిల్లాలోని వర్కల, అంచుతెంగు, అయిరూర్, ఎడవా తీరాల వెంబడి కంటైనర్లు కనుగొన్నారు. కోస్టల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంచుతెంగు,

మాంపల్లి, ముత్యాలపోలిలలో కూడా కంటెనర్ల నుంచి పార్శిళ్లు ఒడ్డుకు వచ్చాయి. ఓడ వర్కలలోని మంధర ఆలయానికి దగ్గరగా ఈ పార్శిళ్లు ఒడ్డుకు చేరాయి. మరోవైపు నౌక నుంచి ఇంధనం బయటికి రావడంతో సముద్రంలో చమురు తెట్టు ఏర్పడిందని వెంటనే తొలగించాలని మెర్కంటైల్ మెరైన్ డిపార్టుమెంట్ షిప్పింగ్ కంపెనీ MSC ఎల్సా 3ని ఆదేశించింది.

## తెలంగాణలో భారీ వర్షాలు :

## వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ ఆదిలాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సంగారెడ్డి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో వర్షం పడే ఛాన్స్ ఉందని.. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.కాగా, రాష్ట్రంలో గత మూడు రోజులుగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వానల కారణంగా పంటలు తడిసి దెబ్బ తినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని జిల్లాల్లో మంచు ముసురు కరుస్తూ వాతావరణం చల్లగా ఉంది.

# దేశవ్యాప్తంగా మళ్లీ కలవరపెడుతోన్న కరోనా వైరస్

**హైదరాబాద్ పెన్ పవర్:** చైనాలో పుట్టి.. ప్రపంచమంతా వ్యాప్తి చెంది.. లక్షలాది మంది ప్రాణాలు బలిగొన్న కోవిడ్ మరోసారి భారత్‌లో కోరలు చాస్తుంది. దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా వైరస్ వ్యాప్తి ప్రజలను కలవరపెడుతోంది. గత వారం రోజుల్లోనే 750 మందికి పైగా ఈ వైరస్ బారిన పడినట్టు ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీల్లో కొత్త కేసులు పెరిగినట్లు పేర్కొంది. కేరళలో కొత్తగా 335 ఇన్ఫెక్షన్లు నమోదు అయ్యయదింతో కేరళలో యాక్టివ్ కేసుల సంఖ్య 430కి చేరింది. మహారాష్ట్రలో 153, ఢిల్లీలో 104 కేసులు నమోదు అయ్యాయి. గుజరాత్‌లో 83, కర్ణాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 12 కేసులు ఉన్నాయి. బాధితులు చాలా వరకూ ఇంట్లోనే ఉంటూ చికిత్స తీసుకుంటున్నారని.. కేసుల పెరుగుదలతో భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర స్పష్టం చేసింది.అధిక కేసుల నేపథ్యంలో కేరళ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాపిడ్ రెస్పాన్స్ బృందాలతో సమావేశం నిర్వహించి వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలప చర్చింది. వ్యాధి తీవ్రత లేకున్నా అందరూ జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం సూచించింది.

# ఆయుర్వేద కేంద్రంలో యోగా రిజిస్ట్రేషన్లు



పిడుగురాళ్ల లో యోగా శిక్షణ

**హైదరాబాద్ పెన్ పవర్:**యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా మంగళవారం కూడా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని ఆయుర్వేద వైద్యశాల నందు వైద్యాధికారిణి డాక్టర్ కే. మేఘమాల ఆధ్వర్యంలో యోగా రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్థానికంగా ఉన్నటువంటి అక్షర్ట్ ప్రాంతం, మార్కెట్ యార్డ్ నందు, వాసవి కళ్యాణ మండపం నందు యోగా శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. ఈ యోగా శిబిరాలు ఆత్మకూరు నరసింహమూర్తి, వడ్లమూడి వెంకయ్య చౌదరి, వి. నరసింహారావు, రమేష్ కుమార్ అనే గురువుల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని డాక్టర్ మేఘమాల తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకో వాల్సిందిగా డాక్టర్ మేఘమాల తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మేఘమాల తో పాటు ఆయుర్వేద కేంద్రం సిబ్బంది దూదేకుల బాబు పాల్గొన్నారు.

# లయోలా కాలేజ్ మోసం చేసింది

**అల్వాల్: పెన్ పవర్:** విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లయోలా కళాశాల యాజమాన్యం, ఉద్యోగ నియామక అధికారి మోసం చేశారంటూ విద్యార్థులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ పూర్తికాక ముందే విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కన్సల్టెన్సీ నుండి వాట్సాప్ ద్వారా తమకు సందేశాలు పంపినట్లు విద్యార్థులు తెలిపారు. పది లక్షల రూపాయల చొప్పున ఒక్కో విద్యార్థి నుండి తీసుకుని విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని కళాశాల యాజమాన్యం కన్సల్టెన్సీ అధికారి చెప్పారని విద్యార్థులు తెలిపారు. వారు చెప్పిన విధంగానే మొత్తం ఐదు మంది విద్యార్థులు ఒక్కొక్కరు పది లక్షల రూపాయలను ఇచ్చినట్లు తెలిపారు. ఇంట్లో తమ తల్లుల బంగారాన్ని అమ్మి సైతం 10 లక్షల రూపాయలు జమ చేసి వారికి పంపినట్లు తెలిపారు. తీరా నకిలీ విదేశీ ఐడీని సృష్టించి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఇదే విషయమై కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానాలు ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. గత మూడు నెలల నుండి ఉద్యోగాల విషయమై కళాశాలకు వచ్చి వెళు _న్నప్పటికీ తమను పట్టించుకోకుండా తమపైనే పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారని కేసులు పెడుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డబ్బులు తిరిగి ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. వెంటనే తమకు డబ్బులు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర.

ముఖ్య అతిథిగా పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్..

**జయశంకర్ భూపాలపల్లి పెన్ పవర్:** భూపాలపల్లి మున్సిపాలిటీలోని 11, 15 వార్డులు వేశాలపల్లి, కాకతీయ కాలనీలల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ, అంబేద్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూల మాల వేశారు. రెండు కాలనీలల్లో నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యాత్రనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ… మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. అదేవిధంగా, పలువురు కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

# మోడీ ఫైడ్ సైలెన్సర్ల తొక్కింపు

- డు...డు...డు...పట్...పట్...పట్...
- అంటూ శబ్దాలు చేసే సైలెన్సర్ల కు చెక్



**అదిలాబాద్ పెన్ పవర్:** పట్టణంలో మోడీ ఫైడ్ సైలెన్సర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహణ రోడ్డు రూలర్ తో తొక్కించబడిన 160 మాడిఫైడ్ సైలెన్సర్లు. చిన్నపిల్లలకు, పెద్ద మనుషులకు, హాస్పిటల్ పరిసరాలలో ఇబ్బందులు కలగకుండా చర్యలు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వాహనాలకు బిగించకూడదని ప్రజలకు విజ్ఞప్తి. నిబంధనల అతిక్రమించిన వారిపై ఇకనుండి కేసుల నమోదు, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1989 తో కేసుల నమోదు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. ఆదిలాబాద్ పట్టణంలో యువత తమ వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లను, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించి చిన్నపిల్లలకు వృద్ధులకు ఆసుపత్రి పరిసరాలలో ఇబ్బందులు కలిగించే తరుణంలో జిల్లా పోలీసు యంత్రాంగం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. ఆదేశాల మేరకు నెల రోజులుగా పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. పట్టణంలో దాదాపు 160 మోడీ సైడ్ సైలెన్సర్లను గుర్తించి వాటిని వాహనాల నుండి తొలగించి కంపెనీ నుండి కేటాయించ బడిన సైలెన్సర్లను మాత్రమే బిగించి వాహనదారులకు విడిచిపెట్టడం జరిగింది. ఇలా సేకరించిన 160 మోడిఫైడ్ సైలెన్సర్లను స్థానిక కలెక్టర్ చౌరస్తా నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమక్షంలో రోడ్డు రోలర్ తో తొక్కించడం జరిగింది. సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. యువత ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించకూడదని సూచించారు. ఇకనుండి మాడి ఫైడ్ సైలెన్సర్లను బిగించిన, పటాకా సౌండ్స్ వచ్చేలా ఏర్పాటు చేసిన సైలెన్సర్లను వారి వాహనాల నుండి తొలగించి వారిపై కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద వారిపై కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. స్థానిక మెకానిక్ లకు తెలియజేస్తూ ఎవరైనా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించమని విజ్ఞప్తి చేస్తే బిగించకుండా ఉండాలని తెలియజేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మాడిఫైడ్ సైలెన్సర్లపై కఠినంగా వ్యవహరిస్తూ అధిక శబ్దాలను చేసే పటాకా శబ్దాలు వచ్చే సైలెన్సర్లను తొలగించి వారిపై చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ పట్టణంలో స్థానిక ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, ప్రణయ్ కుమార్, ఎస్ఐలు మహేందర్, దేవేందర్, ట్రాఫిక్ సిబ్బంది రాజేష్, రామకృష్ణ, రమేష్, ఫిరోజ్, విజయ్, సతీష్, రామకృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసులపై హత్యాకాండను అపాలి




**జగిత్యాల, పెన్ పవర్:** ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం ఆదివాసులపై చేస్తున్న హత్యాకాండను అపాలని ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జగిత్యాల లో వామపక్ష, ప్రజాతంత్ర, అంబేద్కర్ వాదుల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ కగర్ వెంటనే ఆపాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి కాల్పుల విరమణ ప్రకటించాలని పేర్కొన్నారు. ఆదివాసులపై ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, అలాగే రాజ్యాంగం లోని 5, 6వ షెడ్యూల్ ని అమలుపరిచి ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అమరుల భౌతిక కాయాలన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వానికి నాయకులు విజ్ఞప్తి చేశారు. జీవించే హక్కు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కని ప్రాథమిక హక్కులను హరించే ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని ప్రజలకు ఈ వాస్తవాలు తెలియనీయకుండా వారిని మతమౌఢ్యులుగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ప్రజలు మేలుకోకపోతే అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను లేకుండా చేయాలని ప్రయత్నిస్తుందని ఈ విషయాల్లో ప్రజలు ప్రశ్నించే గొంతులకు అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, పౌర హక్కుల సంఘం నాయకులు పొన్నం రాజమల్లు, భారత్ బచావో నాయకులు పిట్టల నారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చింత భూమయ్య, గల్ఫ్ బాధిత సంఘం నాయకులు జిల్లా రవి గౌడ్ ,డి ఎల్ పి ఓ జిల్లా అధ్యక్షులు ఈ ప్రమోద్ కుమార్, ఏఐకేఎంఎస్ నాయకులు గాజంగి రాజేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:**నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాధార%శీ%గా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి జిల్లా కార్యదర్శి మాలోతు రమేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పురుషోత్తం సురేష్, మండల కార్యదర్శి జెట్టి రామ్మూర్తి,ముల్క రాజేష్, ఓరగంటి రాజు,దూలపెల్లి రవీందర్రావు,పూల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్క జొన్న కాల్చే యంత్రంతో స్వయం ఉపాధి



**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:**మొక్క జొన్న కంకులు కాల్చడం, ఉడికించడం మరియు మొక్క జొన్నతో వివిధ రకాల తిను బండారాలు చేస్తూ, ఇన్నోవేటివ్ ఆలోచనతో స్వయం ఉపాధి పొందుతున్న రైతు మధుకర్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. జిల్లాలోని చిట్యాల మండలం, జూకల్ గ్రామానికి చెందిన మధుకర్ బిటెక్ (సివిల్ ఇంజినీరింగ్) విద్యానభ్యసించారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల ఉద్యాబ్యాసం మధ్యలో మానేయాల్సి వచ్చింది. స్వయం ఉపాది కొరకు ఆలోచన చేసిన మధుకర్ 50 వేల రూపాయల విలువతో విద్యుత్తు ద్వారా మొక్క జోక్క కంకులు కాల్చి, ఉడికించే యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రం వినియోగం ద్వారా త్వరగా కంకులు కాల్చడం, ఉడికించడం చేస్తూ ఉపాధి పొందుతున్నారు. నెలకు 30 నుండి 50 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని మధుకర్ తెలిపారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా డీఆర్డీఓ ద్వారా కేటాయించిన స్టాల్ లో మొక్క జొన్నలు విక్రయిస్తూ ఆదాయం పొందానని ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి స్టాల్ పరిశీలించి కాల్చిన మొక్క జొన్న కంకులు తిని బావున్నాయని అభినందించారని తనకు ఇదొక ప్రేరణగా నిలిచిందని తెలిపారు. మహిళా సంఘాలకు ఉపాధి కల్పనకు ఇలాంటి యూనిట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని
జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ డిఆర్డిఓ కు సూచించారు.

## రక్తదానం చేసిన కడప జిల్లా టిడిపి అధ్యక్షులు

**హైదరాబాద్ పెన్ పవర్:**కడపలో మహానాడు సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ బ్లడ్ డోనేషన్ క్యాంపులో మొట్టమొదటి రక్తదాతగా పాల్గొన్న పోలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రక్తదాతగా గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు.
సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఒక సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని, ప్రతి కార్యకర్త రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యంగా నిలవాలని శ్రీనివాసరెడ్డి అన్నారు.

# పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తా

**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సిద్దిపేటలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు అనంతరం జిల్లా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కాముని రాజేశం, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాలరాజ్, కోశాధికారి సురం ప్రసాద్ లతో పాటు కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్, ప్రధాన కార్యదర్శి బూర మల్లేశం, ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు,జోగు బిక్షపతి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం వారు మాట్లాడుతూ పద్మశాలీలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ఎదుగుదలకు నూతన కమిటీ పాటుపడాలని సూచించారు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కాముని రాజేశం, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాలరాజ్ మాట్లాడుతూ సిద్దిపేట పద్మశాలి సమాజం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సహకారంతో సిద్దిపేటలోని చేనేత కార్మికులకు పద్మశాలీలకు ప్రభుత్వ పదంగా వచ్చే అన్ని పథకాలు అందే విధంగా చూస్తామని తెలిపారు.



పద్మశాలి సమాజం శ్రీ మార్కండేయ దేవాలయ అభివృద్ధికి పాటు పడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోశాధికారి సూరం ప్రసాద్, పెద్ది అశోక్ ఇప్ప కాయల శ్రీహరి, గుండు రవితేజ, చిలుక ఆంజనేయులు, పెద్ది శ్రీనివాస్ బైరి ప్రకాష్, దీకొండ మహేష్, ఆడేపు శ్రీనివాస్, కొండబత్తిని రాజ్కోటి, పేర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్ కుమార్ శ్రీమాన్ సునీత పాల్గొన్నారు.

# ముందే పలకరించిన తొలకరి రాష్ట్ర అవసరాలకు సరిపడా లేని ఎరువులు, విత్తనాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**కావాల్సిన యూరియా 4 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నది 1.7 లక్షల టన్నులే
అవసరమైన 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లకు సిద్ధంగా ఉన్నవి 40 లక్షల ప్యాకెట్లే,
పచ్చిరొట్ట విత్తనాలదీ అదే పరిస్థితి,
సీజన్ ముందుకు రావడంతో విత్తనాలు, ఎరువుల కోసం రైతుల ఎదురుచూపులు తెలంగాణ లో తొలకరి చినుకు ముందే పలకరించడంతో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడుతున్నారు. అయితే, ఈ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడంలో వ్యవసాయ శాఖ విఫలమైందనే విమర్శలొస్తున్నాయి. రాష్ట్ర అవసరాలకు తగినంత స్థాయిలో ఎరువులు, విత్తనాలు ప్రస్తుతానికి అందుబాటులో లేవని తెలుస్తున్నది. ముఖ్యంగా యూరియా, పత్తి విత్తనాల కొరత ఏర్పడే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ అధికారులే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ వానకాలంలో 1.34 కోట్ల ఎకరాల్లో పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందులో అత్యధికంగా 66.8 లక్షల ఎకరాల్లో వరి, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాల్లో పత్తి, 9 లక్షల ఎకరాల్లో సోయా పంటలు సాగవుతాయని అంచనా వేసింది.

**యూరియా కొరత తప్పదా?**

ఈ సీజన్‌కు 9.8 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా. అయితే ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు, ప్రభుత్వం వద్ద కలిపి 3.17 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నట్టు తెలిసింది. రైతులు ఎక్కువగా యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్యాక్స్, మీద ఆధారపడతారు. ప్యాక్స్‌కు యూరియాను సరఫరా చేసే మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలు అడుగంటినట్టు తెలిసింది. సీజన్‌కు ముందే మార్క్‌ఫెడ్ వద్ద సుమారు 4లక్షల టన్నుల బఫర్ స్టాక్ ఉండాలి. కానీ, శనివారం నాటికి 1.72 లక్షల టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నది.
ఉండాల్సిన దాని కన్నా 2.28లక్షల టన్నులు తక్కువగా ఉన్నది. ఈ కొరతకు తోడు కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రావడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలకు కలిపి 3.3 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి రావాల్సి ఉండగా 1.72లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. అంటే 1.58 లక్షల టన్నులు తక్కువగా వచ్చింది. ఈ విధంగా మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ నిల్వలు తక్కువగా ఉండి, కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రాక పోవడంతో రాష్ట్రంలో యూరియా కొరత తప్పదనే ఆందోళన వ్యవసాయ శాఖ అధికారుల్లో వ్యక్తమవుతున్నది. ఈ ప్రభావం సాగుపై పడుతుందని, రైతులకు ఇబ్బంది తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**విత్తనాలకూ కొరతే?**

ఎరువులతో పాటు విత్తనాలకు కూడా కొ రత తప్పేలా కనిపించడం లేదు. ముఖ్యంగా గత సంవత్సరం మాదిరిగానే పత్తి, పచ్చిరొట్ట విత్తనాలకు తిప్పలు తప్పేలా లేవు. ఈ సీజన్‌లో 50లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం కనీసం కోటిన్నర పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం. అయితే వ్యవసాయ శాఖ మాత్రం 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందించింది. కానీ, ప్రస్తుతం 40 లక్షల విత్తన ప్యాకెట్లు మాత్రమే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీనికి తోడు పచ్చిరొట్ట విత్తనాల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.
ప్రభుత్వం 1.94 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తే.. విత్తనాభివృద్ధి సంస్థ 97 వేల టన్నులకు మా త్రమే ప్రణాళిక రూపొందించింది. ఇందులో ప్రస్తుతం సగం విత్తనాలే క్షేత్రస్థాయికి చేరినట్టు తెలిసింది. పలు జిల్లాల్లో రైతుకు పచ్చిరొట్ట విత్తనాలు ఒక్క సంచి మాత్రమే ఇస్తున్నట్టు సమాచారం. అది కూడా క్యూలైన్లలో నిలబడితే గానీ లభించడం లేదని చెప్తున్నారు.

ముందుకొచ్చిన సీజన్:

గతంతో పోల్చితే ఈ ఏడాది సీజన్ చాలా ముందుకొచ్చింది. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే రుతుపవనాలు ఇప్పటికే వచ్చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా తొలకరి జల్లులు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. అధికారులు మాత్రం మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేగంగా కదలడం లేదు. జూన్ ప్రణాళిక ప్రకారమే పనిచేస్తున్నారు. ఇప్పుడు సీజన్ సుమారు 20 రోజులు ముందుకు రావడంతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.